క్లుప్తంగా

ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు బాధ్యతలు



ఫిరంగిపురం: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్.వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన విమాదేవి బదిలీపై కృష్ణా జిల్లాకు వెళ్లారు. పల్నాడు జిల్లా నరసరావుపేట నుంచి బదిలీపై వెంకటేశ్వరరావు ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ

తాడేపల్లి రూరల్: మండలంలోని కొలనుకొండ వద్ద మోటూరు ఉదయం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందిన (2వ బ్యాచ్) వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్లు ఐద్వా కార్యదర్శి డి. రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోటూరు ఉదయం ట్రస్ట్ గ్రామీణ మహిళలకు, కార్మికులకు, విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో నైపుణ్యశిక్షణ అందజేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కొలనుకొండ పరిధిలోను, తాడేపల్లి పట్టణ పరిధిలో మేకా అమరారెడ్డి భవన్‌లో కోర్సులను నిర్వహిస్తున్నారన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

తాడేపల్లి రూరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మాజీ అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతి వేడుకల్ని దుగ్గిరాల కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షులు పసుపులేటి గణేష్ దీనదయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1916 సెప్టెంబర్ 25న ఉత్తర ప్రదేశ్‌లోని మధర దగ్గర నల్లచంద్రభాన్‌లో దీనదయాళ్ జన్మించారని తెలిపారు. 1952లో భారతీయ జన సంఘ్‌లో చేరి ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారని చెప్పారు. 1967లో జన సంఘ్ అధ్యక్షులుగా, ఆర్ఎస్ఎస్ వారపత్రిక పాంచజన్య, లక్నో దినపత్రిక స్వదేశ్‌లకు సంపాదకులుగా వ్యవహరించారని వివరించారు. ఏకాత్మతా మానవతా వాదం సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాటిబండ్ల రాజా, గడ్డం శేషగిరి, తాడిబోయిన శ్రీనాథ్, దాసరి నాగ పాల్గొన్నారు.

మైనర్ బాలికను వేధించిన వ్యక్తి అరెస్ట్



మంగళగిరి: మైనర్ బాలికను వేధించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ వెంకట్ బుధవారం తెలిపిన వివరాల మేరకు... నగర పరిధిలోని ఆత్మకూరులో మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన జక్కరయ్య జగపతిబాబు కొంత కాలంగా ప్రేమిస్తున్నానని వెంటపడుతున్నాడు. బాధితురాలు తల్లితండ్రులకు తెలియజేయడంతో మంగళగిరి రూరల్ పోలీసులకు ఈ నెల 24 వ తేదిన ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మునగపాడులో పౌష్టికాహార ప్రదర్శన

ఫిరంగిపురం: మండలంలోని మునగపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలలో భాగంగా బుధవారం గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఐసీడీఎస్ సూపర్ వైజర్ సునీత వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత నివారించవచ్చని చెప్పారు. పౌష్టికాహారం తయారు చేసే విధానం తెలియజేశారు, కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, కార్యదర్శి విష్ణువర్ధన రావు, వీఆర్వో బ్రహ్మయ్య, మహిళా పోలీసు గాయత్రి, ఎంఎల్‌హెచ్‌పీ లింగరాజు, అంగన్‌వాడీలు ఆరోగ్య మేరి, సుజాత, ఆశా కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: ఫ్రూట్ మినిస్ట్రీస్, కడవరి సందేశం ఆధ్యాత్మిక మాస పత్రిక సిల్వర్ జూబ్లిని పురస్కరించుకుని పెదరావూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురు వైద్యులు వైద్య పరీక్షలు చేసి రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పాస్టర్ తుమ్మల ప్రశాంతరాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం' సభ ప్రసంగాలకే పరిమితం

కరపత్రాల పంపిణీ లేకుండానే ముగించేసిన ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

రావెల(తాడికొండ): తాడికొండ మండలం రావెల గ్రామంలో బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ప్రసంగాలకే పరిమితమైంది. టీడీపీ 100 రోజుల పాలనలో ప్రజలకు చేసిన మంచిని కరపత్రాల పంపిణీ ద్వారా గ్రామంలో తిరిగి ప్రజలకు తెలియజేయాలంటూ పార్టీ ఆదేశాల మేరకు కొనసాగుతున్న ఈ కార్యక్రమం నామ మాత్రంగానే ముగిసింది. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ సాయంత్రం వచ్చారు. ప్రసంగాలు మాత్రమే చేసి కార్యక్రమాన్ని ముగించేశారు. వేదికపై బారులు తీరిన నాయకులు తమదైన శైలిలో ఊకదంపుడు ఉపన్యాసాలు చేసి ప్రజలకు విసుగు తెప్పించారు. అంతా విన్న ప్రజలు అసలు 100 రోజుల్లో ఏం మంచి చేశారంటూ ? ఒకరినొకరు గుసగుసలాడుకుంటూ ఇంటి బాట పట్టారు. ఇంత వరకూ 100 రోజుల పాలనలో పింఛన్ పంపిణీ మినహా ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదని, చిన్నారుల విద్యా భవితకు అమ్మఒడి, అన్నదాతలకు రైతు భరోసా అమలు లేకపోవడంపై ఆయా వర్గాలకు చెందిన వారు పెదవి విరిచారు. కార్యక్రమంలో సర్పంచ్ రావెల శైలజ, ఎంపీడీవో సమతావాణి, తహసీల్దార్ నాసరయ్య, యార్డు మాజీ చైర్మన్ కొమ్మినేని రామచంద్రరావు, మాజీ వైస్ ఎంపీపీ దగ్గుమల్లి శ్రీనివాస రావు, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్న కుమార్, మాజీ సర్పంచ్ దేవరపల్లి చినపాములు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మా కుమార్తె ఆత్మహత్యకు కారణాలు చెప్పండి.. ప్లీజ్ !

- వీసీతో మాట్లాడించాలంటూ కళాశాల ఎదుట పడిగాపులు కాసిన తల్లిదండ్రులు
- కలిసేందుకు నిరాకరించారని చెప్పడంతో ఆవేదన
- వీఐటీలో 17న ఆత్మహత్య చేసుకున్న సాయి శ్రియ



వీసీని కలిసేందుకు అవకాశం ఇవ్వాలంటూ అడుగుతున్న శ్రియ తల్లి

తాడికొండ: తమ కుమార్తె ఆత్మహత్యకు గల కారణాలు తెలియజేయండి! అంటూ వీఐటీ ఏపీ ఎదుట ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సాయి శ్రియ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వీఐటీ ఏపీ యూనివర్సిటీలో ఈనెల 17న ఉరివేసుకొని సాయి శ్రియ అనే బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో తమ కుమార్తె ఎలా చనిపోయింది ? అనే వివరాలు తెలుసుకునేందుకు బుధవారం తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చారు. వీసీని కలిసేందుకు యత్నించడంతో సెక్యూరిటీ సిబ్బంది లోపలికి అనుమతించకుండా ఇబ్బందులకు గురిచేయడంతో వారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తల్లి మంజుల మాట్లాడుతూ తమ కుమార్తె హాస్టల్‌లో భోజనం చేస్తుందా.. లేదా ? అనే వివరాలు తెలియజేయాలంటూ సిబ్బందిని కోరారు. వీసీతో మాట్లాడేందుకు తమకు అనుమతి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ''అసలు ఎందుకు చనిపోయిందో వివరాలు తెలియజేయాల్సిన బాధ్యత వారికి లేదా ?'' అని ప్రశ్నించారు. ''మేమెక్కడో హైదరాబాద్‌లో ఉంటాం.. ఏం జరిగిందో తెలియజేయాలంటూ కోరినా మాకు ఎలాంటి సమాధానం ఇవ్వడం'' లేదనే బాధను వ్యక్తం చేశారు.

వీసీ కోటిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

విట్ కళాశాల వైస్ చాన్స్‌లర్ కోటిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో సీఎస్ బీఎస్ రెండవ సంవత్సరం చదువుతున్న జి. సాయి శ్రియ ఈనెల 17న క్యాంపస్ హాస్టల్‌లో అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని, దీనిపై గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైందని తెలిపారు. దీనిపై వైస్ చాన్స్‌లర్ స్పందించకపోగా శ్రియ బంధువులు, తల్లిదండ్రులను కలవకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని ఖండించారు. దీనిపై రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, విద్యాశాఖామంత్రి తక్షణం జోక్యం చేసుకొని బాధ్యతగా ఆ విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

28న భగత్‌సింగ్ జయంత్యుత్సవం



తాడేపల్లి రూరల్: స్వాతంత్ర్య సమర యోధుడు భగత్‌సింగ్ జయంతి ఉత్సవాన్ని జయప్రదం చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కన్వీనర్ సందెపోగు ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి శైలజ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ 33వ ఏటా ఉరికంబాన్ని చిరునవ్వుతో ముద్దాడిన విప్లవ సోషలిస్టు అయిన భగత్‌సింగ్ జయంతి ఉత్సవాన్ని ఈ నెల 28న నిర్వహించనున్నామని తెలిపారు. యువత ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. యూఎస్ఎఫ్ఐ సమస్యలపై చేస్తున్న పోరాటాలకు విద్యార్థులు ఏకతాటిపై అండగా నిలవాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు గడుస్తున్నా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం దురదృష్టకరం అని విమర్శించారు.

గులాబీ రంగు పురుగు ఉధృతిని అరికట్టాలి



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు, రేపూడి గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో వాసంతి మాట్లాడుతూ పత్తిలో కాయను తొలచే గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పంటను వేసేముందు లోతుగా భూమిని చదును చేసుకొని, వేపగింజల కషాయాన్ని చల్లుకోవడం ద్వారా గులాబీ రంగు పురుగు ఉధృతిని నివారించవచ్చని తెలిపారు. లద్దెపురుగు నివారణకు అక్కడక్కడా ఆముదం మొక్కలు వేసుకోవాలని రైతులకు సూచించారు. మిరప పంట వేసేముందు ఎకరాకు నూనె తీయని వేపపిండిని వేసుకోవాలని తెలిపారు. జి.చౌడయ్య, కొసనా నాగరాజు, కొడవటి కిరణ్‌కుమార్, విస్తరణాధికారి షేక్ సుభాని, సిబ్బంది బి.హకీం, వల్లపు మల్లిక, రైతులు పాల్గొన్నారు.

స్కూల్స్‌గేమ్స్‌లో విద్యార్థుల సత్తా

భట్టిప్రోలు: చుండూరు మండలం యడ్లపల్లి ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన స్కూల్‌గేమ్స్ జిల్లా స్థాయి ఆటలు పోటీలు, అథ్లెటిక్స్‌లలో భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవ భక్తుని కోటయ్య జెడ్పీ హైస్కూల్, సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పెసర్లంక హైస్కూల్ నుంచి షాట్‌పుట్, డిస్క్ త్రోలో ఎస్.సంతోష్ ప్రథమ, 100, 200, 400 మీటర్ల విభాగాలలో కె.నిహారిక ప్రథమ స్థానంలో నిలిచారు. సూరేపల్లి హైస్కూల్ నుంచి షాట్‌పుట్, డిస్క్‌త్రో విభాగాలలో వి.చైతన్య ప్రథమ స్థానం, డిస్క్ త్రోలో బి.గీతికాశ్రీ, 100 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్‌లో జె.నితీష డిస్క్ త్రోలో ఎం.అభిరామ్ ద్వితీయ స్థానం, 400, 200, 800 మీటర్ల రన్నింగ్‌లో కె.ప్రవల్లిక ద్వితీయ స్థానం సాధించారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ దాసరి వెంకట ప్రసాద్, పీఈటీ నాగేశ్వర రావు, ప్రతిభ చూపిన బాలబాలికలను ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె మహబూబ్ భాషా, కె. శ్రీనివాస శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రతిభ చూపిన బాలబాలికలు ఈనెల 27న జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొననున్నారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పారిశుధ్య పనులు



తాడేపల్లిలో రోడ్లను శుభ్రం చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా ఆదేశాల మేరకు బుధవారం ఎయిమ్స్ రోడ్డు నుంచి తాడేపల్లి ప్రకాశం బ్యారేజ్ వరకు స్వీపింగ్ మిషన్‌తో రోడ్లను శుభ్రం చేశారు. డంపింగ్ యార్డులో చెత్తను పూర్తి ఎత్తివేసి బ్లీచింగ్ చల్లారు. కాలువలు, డివైడర్ల వెంబడి కలుపు మొక్కలను తొలగించారు. పలు ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. విద్యుత్, నీటి ఆదాతో పాటు ప్లాస్టిక్ నిరోధంపై అవగాన కల్పించారు. తాగునీరు పరిశుభ్రంగా ఉండేందుకు వాటర్ ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్ చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో..

స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల సందర్భంగా మండలంలోని వేమవరం మండల పరిషత్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు తడిచెత్త , పొడిచెత్తపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఇంటిలోని ఉన్న చెత్తను తడి, పొడిగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని గ్రామస్తులకు సూచించారు. ఇంటి చుట్టు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాల బారి నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. ఘన వ్యర్థాల నిర్వహణ, వర్షపునీరు నిలువ చేసే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దివి కమల్ మోహన్, సచివాలయ సిబ్బంది ప్రభాకర్, గోపి, యశోద, శివ, ఉపాధ్యాయుడు రవి పాల్గొన్నారు.

మంగళగిరిలో..

నగరంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నగర పరిధిలోని ఆత్మకూరులో బుధవారం మెయిన్ రోడ్డు నుంచి పారిశుధ్య, పరిశుభ్రతపై సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు.అనంతరం స్వీపింగ్ మిషన్లతో రోడ్లను శుభ్రపరిచారు. వడ్డెర పాలెం డంపింగ్‌యార్డులోని చెత్తను పూర్తిగా తొలగించి బ్లీచింగ్ వేశారు.

బాల కార్మికుల నిర్మూలనే లక్ష్యం

జిల్లా కార్మిక శాఖ అధికారి సుభాని



ర్యాలీలో పాల్గొన్న జిల్లా కార్మిక శాఖ అధికారి సుభాని, తహసీల్దార్ సునీత తదితరులు

తాడేపల్లి రూరల్: చదువుకోవాల్సిన వయసులో బాల కార్మికులుగా మారిన వారిని గుర్తించి బడిలో చేర్చడమే బాధ్యతని గుంటూరు జిల్లా కార్మిక శాఖ అధికారి బి.ఎం. సుభాని తెలిపారు. దుగ్గిరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో బుధవారం బాలకార్మిక వ్యతిరేక ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుభాని మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఉప కార్మిక కమిషనర్ సంయుక్తంగా దుగ్గిరాల మండలాన్ని బాలకార్మిక రహితంగా ప్రకటించారని తెలిపారు. 14 ఏళ్లలోపు బాలలంతా పాఠశాలలో విద్యను అభ్యసించాలని చెప్పారు. 18 ఏళ్లలోపు బాలలు ప్రమాదకరమైన పనులు చేయరాదని, ఆ విధంగా ఎవరైనా గుర్తించినట్లయితే కార్మికశాఖ అధికారికి సమాచారం అందజేయాలని ఆయన కోరారు. తల్లిదండ్రులు పిల్లలను పనిబాట కాకుండా బడి బాట పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె. శ్రీనివాసరావు, తహసీల్దార్ సునీత, ఇన్‌చార్జి ఎంపీడీవో పి. శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ శరత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. బాలసుందరం, జిల్లా కోఆర్డినేటర్ కె. సమీర్‌కుమార్ పాల్గొన్నారు.

30న సీఐటీయూ ఆధ్వర్యంలో 'చలో గుంటూరు'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: వైద్య, ఆరోగ్య, మున్సిపల్, విద్యుత్, విద్య తదితర రంగాల్లో తక్కువ జీతాలకు పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న 'చలో గుంటూరు' కార్యక్రమాన్నినిర్వహిస్తున్నట్లు సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమంలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ప్రకాష్‌నగర్ సీఐటీయూ కార్యాలయంలో బుధవారం 'చలో గుంటూరు' కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో ఒకేరకమైన పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న వారికి సమాన వేతనాలు అమలు చేయడం లేదని తెలిపారు. రెండు సంవత్సరాలుగా కొబ్బరి నూనెలు ఇవ్వకుండా ఆరు నెలలకు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. వైద్య, విద్యుత్ రంగాల్లో రూ. 15 వేలు, రూ. 18 వేలు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు రంగాల్లోనూ కనీస వేతనాలు అమలు జరగడం లేదని పేర్కొన్నారు. కనీస వేతనాలు అమలు కాని కార్మిక, ఉద్యోగులంతా 'చలో గుంటూరు'కు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె. వెంగమ్మ, ఎం. కామాక్షి, బూరగ వెంకటేశ్వర్లు, కె. స్టీఫెన్, వై. యెహోషువా, ఆశీర్వాదం, వి. శాస్త్రి పాల్గొన్నారు.

మైనర్లకు వివాహాలు చేయడం నేరం



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్ వైజర్ సీతారావమ్మ

మందడం(తాడికొండ): 18 సంవత్సరాలు నిండని చిన్నారులకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని మందడం సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీతారావమ్మ అన్నారు. తుళ్లూరు మండలంలోని మందడం ఎస్టీ కాలనీలో బుధవారం గుడ్ షెపర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సేవాసంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టులో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సీతారావమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపినా, బాలలను కార్మికులుగా మార్చి వెట్టిచాకిరి చేయించినా చర్యలు ఉంటాయని తెలిపారు. బాలికలపై లైంగిక దాడులు జరిగినా వెంటనే 1098, 100 టోల్ ఫ్రీ నంబర్‌లకు ఫోన్‌ద్వారా సమాచారం అందిస్తే తక్షణ చర్యలు ఉంటాయని చెప్పారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా పెళ్లిళ్లు చేస్తే అనారోగ్య సమస్యలు వస్తాయని వివరించారు. ఇది వివాహం చేసుకున్న దంపతులతో పాటు పుట్టబోయే బిడ్డల్లో కూడా వైకల్యం వంటివి వచ్చి జీవితాంతం ఇబ్బందులు ఎదుర్కోవాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే అనేక రకాల యాప్స్‌కు పిల్లలను దూరంగా ఉంచాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై చిన్నారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సంస్థ సభ్యులు జె. ఇశ్రాయేల్, మంగళగిరి మండల కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎస్. నాగమణి, తుళ్లూరు మండల ఆర్గనైజర్ అత్తోట పోతురాజు, అంగన్‌వాడీ టీచర్లు, పలువురు చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఫిరంగిపురం: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు పెట్టుబడి సాయం అందించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం కౌలు రైతు సంఘం, రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించలేదని విమర్శించారు. దీంతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు పెట్టు బడిసాయం కింద రూ. 20వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మస్తాన్‌వలి, వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో సిబ్బందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆస్టర్ రమేష్ ఆసుపత్రి వైద్యులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో బుధవారం యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో విజయవాడ ఆస్టర్ రమేష్ ఆసుపత్రి సహకారంతో ఆచార్యులు, ఉద్యోగులకు విజయవాడ ఆస్టర్ రమేష్ ఆసుపత్రి సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు ప్రారంభించారు. ఊపిరితిత్తులు, గుండె, ఎముకలు, కీళ్ల సంబంధిత వ్యాధుల వైద్య నిపుణులు పరీక్షలు చేశారు. ఈసీజీ, షుగర్, రక్తపోటు పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఎకో పరీక్షలు కూడా జరిపారు. ఊపిరితిత్తుల వైద్యులు డాక్టర్ ప్రసాద్‌రెడ్డిలతో పాటు ఆస్టర్ రమేష్ ఆసుపత్రి సిబ్బంది పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంక్షేమ విభాగం అసోసియేట్ డీన్ కె. రూత్ రమ్య, వీసీ జి. పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు ఎ.వి.ఎస్. ప్రసాద్, ఎన్. వెంకట్‌రామ్, కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ప్రొఫెసర్ ఆర్. సుభాకర్‌రాజుపాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం నేతల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లి రూరల్: ఇటీవల కృష్ణానది వరద ముంపునకు గురై పంటలు దెబ్బతిన్న రైతుల్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ ఆగస్టులో కురిసిన భారీ వర్షాల కారణంగా దుగ్గిరాల మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలు, లంక గ్రామాల్లో వాణిజ్య, ఉద్యాన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. వరి రైతులు ఎకరాకు కౌలు సహా రూ. 50 వేలు నష్టపోయారని, పసుపు, కంద లాంటి వాణిజ్య పంటలకు లక్షల రూపాయలు ఖర్చు చేశారని వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వరికి ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య ఉద్యాన పంటలకు ఎకరాకు లక్ష రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని ఆయన కోరారు. దెబ్బతిన్న మోటారుకు రూ. పది వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ కింద రూ. 20 వేలను తక్షణమే రైతు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతు సంఘం నాయకులు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలని, రుణాలు రద్దు చేయాలని కోరారు. ధర్నా అనంతరం దుగ్గిరాల తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి వై. బ్రహ్మేశ్వరరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు యోగేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



మండలంలోని నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి ఎస్‌జీటీ, ఖోఖో, కబడ్డీ, షటిల్ పోటీలకు ఎంపికలు నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర రావు, పీడీ రవి అభినందించారు.

– మంగళగిరి

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ



తెనాలిరూరల్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని కాలువ కట్టలపై నిరాశ్రయులుగా జీవిస్తున్న నిరుపేద గిరిజనులకు ట్రైబల్స్ ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున బుధవారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. అనంతరం రైల్వే స్టేషన్ సమీపంలో భారీ వర్షాల కారణంగా తలదాచుకున్న సంచార కుటుంబాలకు దుప్పట్లు, చాపలను అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ రావూరి అంజలి, డైరెక్టర్ రావూరి సురేష్ బాబు, వాలంటరీలు ఇంటూరి విజయభాస్కర్, బందెల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.